బోనాల ఉత్సవాలకు డిప్యూటీ మేయర్‌కు ఆహ్వానం



లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని లాలాపేటలో ఆదివారం జరిగే బోనాల వేడులకు రావాలంటూ పలువురు నిర్వాహకులు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి దంపతులను ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం వినోభానగర్‌కు చెందిన తేజా యూత్ అసోసియేషన్ నాయకులు తార్నాకలోని ఆమె నివాసంలో డిప్యూటీ మేయర్‌ను కలిసి ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు.

మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుకుందాం



పార్కులో మొక్కను నాటుతున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ అన్నారు. బుధవారం లలితనగర్ పార్క్‌లో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రకృతిని కాపాడి భవిష్యత్తును సురక్షితంగా ఉంచుదాం అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేష్, పాకసాయి, కృష్ణకుమారి, భూలక్ష్మి, హార్టికల్చర్ మేనేజర్ మహేశ్వరి, సూపర్వైజర్ ప్రవీణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాచ్ వర్క్ పనుల పరిశీలన



ఆలయం వద్ద ప్యాచ్ వర్క్ పనులు చేయిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కార్పొరేటర్ కంది శైలజ అధికారులను కోరారు. బౌద్ధనగర్ డివిజన్ పలు ఆలయాలను సందర్శించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు పనులు చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయాల మార్గంలో ప్యాచ్‌వర్క్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు..

సనత్‌నగర్: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం జనహిత సేవా ట్రస్ట్, భారత్ వికాస్ పరిషత్ సహకారంతో విద్యార్థినులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మంది విద్యార్థినులకు రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించారు. రక్తహీనత లక్షణాలు కలిగిన వారికి పోషకాహార నియమాల గురించి వివరించారు. భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.శివరామకృష్ణ, ఎన్.సదాశివరెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మృదుల పాల్గొన్నారు.

అందరి సహకారంతో జాతర విజయవంతం



విలేకరుల సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర అందరి సహకారంతో విజయవంతమైందని మహంకాళి దేవాలయ బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు అన్నారు. బుధవారం ఈవో గుత్తా మనోహర్ రెడ్డి తో కలిసి కమిటీ సభ్యులు హేమంత్‌సింగ్ ఠాకూర్, దేవి వరప్రసాద్, శ్రీకాంత్, అశ్విన్ గౌడ్, రాకేష్ అగర్వాల్, వేణుగోపాల్‌గౌడ్, కృష్ణ ముదిరాజ్‌లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు, వాలంటీర్లు సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కీలక పాత్ర పోషించారని చెప్పారు.

బోన వైభవం..

268 ఆలయాలు..1.62 కోట్లు.. ఆలయ ప్రతినిధులకు చెక్కుల పంపిణీ



ఆలయాల కమిటీ ప్రతినిధులకు చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలోని నల్లపోచమ్మ అమ్మవారు..

సనత్‌నగర్: ఆషాఢ మాసం వచ్చిందంటే అంతటా 'బోన' వైభవమే. చిన్న చిన్న దేవాలయాల నుంచి పేరెన్నిక గన్న పెద్ద పెద్ద ఆలయాల వరకు ఆషాఢ శోభతో అలరారుతుంటాయి. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారిని కొలుస్తూ మహిళలు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకుంటుంటారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచే బోనాల ఉత్సవాల ప్రాశస్త్యాన్ని నలుదిశలా చాటేందుకు గత ప్రభుత్వం బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన విషయం విదితమే. కేవలం ప్రకటనకే పరిమితం కాకుండా దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలతో పాటు ప్రైవేటు ఆలయాలకు కూడా దన్నుగా నిలిచేలా ఆర్థిక సహాయాన్ని అందించే బృహత్తర కార్యక్రమానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా అదే సంప్రదాయం కొనసాగుతూ వస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది బోనాల చెక్కుల పంపిణీ ఇప్పటికే ప్రారంభమైంది. ఆషాఢమాసం మొదటి మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, మూడో ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర, ఇక నాలుగో ఆదివారం అన్ని ప్రాంతాల్లోనూ బోనాల ఉత్సవాలను నిర్వహించుకుంటూ రావడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నెల 20వ తేదీన అన్ని దేవాలయాల్లో బోనాల ఉత్సవాలు జరగనున్నాయి. ఆ మేరకు చెక్కుల పంపిణీ కొనసాగుతూ వస్తోంది. ఇప్పటికే 80 శాతం వరకు చెక్కుల పంపిణీ పూర్తవ్వగా రెండు మూడు రోజుల్లో మిగతా చెక్కుల పంపిణీ కూడా పూర్తి చేయనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

268 ఆలయాలు..1.62 కోట్లు..

సనత్‌నగర్ నియోజకవర్గంలోని సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట, మోండా (పార్ట్) డివిజన్ల పరిధిలో మొత్తం 268 దేవాలయాలకు ఆర్థిక సహాయ చెక్కులు మంజూరయ్యాయి. వీటన్నింటికీ కలిపి రూ.1,62,43,900ల ఆర్థిక సహాయాన్ని నియోజకవర్గ ఆలయాలకు అందిస్తున్నారు. అయితే ఉత్సవ నిర్వహణ, ఆలయ మెయింటెనెన్స్ ఆధారంగా కనిష్టంగా రూ.10,000 నుంచి గరిష్టంగా 15 లక్షల వరకు చెక్కులను పంపిణీ చేశారు. అత్యధికంగా మహంకాళి అమ్మవారి ఆలయానికి ప్రభుత్వం తరుపున 15 లక్షల వరకు ఆర్థిక సహాయం అందింది. అలాగే సనత్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్)కు సైతం దాదాపు రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందింది. ఇదిలా ఉండగా కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే బేగంపేట డివిజన్ (పార్ట్) పరిధిలో 22 దేవాలయాలకు రూ.6,06,000లు మంజూరు కాగా వాటిని ఆయా దేవాలయాల కమిటీ ప్రతినిధులకు అందజేశారు. చిన్న చిన్న ఆలయాలకు ప్రభుత్వం తరుపున అందే ఆర్థిక సహకారంతో పాటు ఆలయ కమిటీ నిధులను కలుపుకుని బోనాల ఉత్సవాలు మరింత ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ముఖ్యంగా చిన్న చిన్న ఆలయాలకు ఈ సహకారం ఎంతగానో తోడ్పాటునందిస్తుందని ఆలయ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. ఆలయాల గోడలకు రంగులు వేయడం, ప్రాంగణాల్లో మరమ్మతులు చేసుకోవడం, ఆలయ పరిసరాలను శుభ్రం చేసుకోవడానికి ఈ మొత్తాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

బోనాల జాతర ఏర్పాట్లలో అలసత్వం వద్దు



చిలకలగూడ బోనాల జాతర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

చిలకలగూడ : ప్రతిష్టాత్మక చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మతోపాటు సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో ఈనెల 20,21 తేదీల్లో జరిగే బోనాల జాతర వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామని, జాతర ఏర్పాట్లలో అధికారుల అలసత్వాన్ని సహించేది లేదని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ హెచ్చరించారు. చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయ ప్రాంగణంలో పలు విభాగాల అధికారులు, ఆలయ నిర్వాహకులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మారావు మాట్లాడుతూ.. రహదారుల మరమ్మత్తులు, పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఆలయాల వద్ద అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజుల పాటు మంచినీటి సరఫరా చేయాలని, జాతర జరిగే ప్రాంతాల్లో మంచినీటి ప్యాకెట్లు ఉచితంగా అందించాలని, విద్యుత్ కోతలు లేకుండా చర్యలు చేపట్టి, మొబైల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు అందుబాటులో ఉంచాలని ఆయా విభాగాల అధికారులకు ఆదేశించారు.

బోయిగూడలో డ్రంకన్ డ్రైవ్



బోయిగూడ ప్రధాన రహదారిలో డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్న చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ ప్రధాన రహదారి ఏషియన్ వైన్స్ ఎదురుగా బుధవారం ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. బోయిగూడ ప్రధాన రహదారి పెట్రోల్ బంకు ప్రాంతంలో పెద్ద ఎత్తున పోలీసులు డ్రంకన్ డ్రైవ్ చేపట్టి వాహనదారులను చెక్ చేశారు. చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్.ఐలు, శ్రీధర్, రాజు తదితరులు కలిసి డ్రంకన్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనదారులను పరీక్షించారు. ఈ సందర్భంగా 10 మంది వాహనచోదకులకు మందు తాగి వాహనం నడుపుతున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాసులు మాట్లాడుతూ పగలు, రాత్రి కూడా రోడ్లపై డ్రంకన్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి వీలుగా పెద్ద ఎత్తున డ్రంకన్ డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



ఎల్‌వోసీని అందిస్తున్న రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్

రాంగోపాల్‌పేట్: పేద ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. మోండా నాలాబజార్‌కు చెందిన లావణ్య అనారోగ్యంతో బాధపడతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు చికిత్సకు సుమారు రూ.5లక్షలు ఖర్చు అవుతుండటంతో అది భరించే పరిస్థితిలో ఆమె కుటుంబం లేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్‌ను సంప్రదించడంతో ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేయడంతో రూ.5లక్షల ఎల్‌వోసీని మంజూరైంది. ఈ ఎల్‌వోసీని అనిల్‌కుమార్ యాదవ్ లావణ్య కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులు డి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో చిరువ్యాపారుల వాగ్వాదం



ఆక్రమణలు తొలగించేందుకు వచ్చిన అధికారులతో వాగ్వాదం చేస్తున్న దృశ్యం

చిలకలగూడ : చిలకలగూడ ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్ ఆక్రమణలను పోలీసుల సహాయంతో జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం తొలగించారు. ఈనెల 20,21 తేదీల్లో చిలకలగూడ కట్టమైసమ్మ బోనాల జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఈ క్రమంలో ఆలయం ఎదురుగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లు, తోపుడుబండ్లను తొలగించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు బుధవారం ఉదయం జేసీబీతో చిలకలగూడకు వచ్చారు. ఆక్రమణలను తొలగిస్తుండగా పలువురు చిరు వ్యాపారులు, తోపుడుబండ్ల నిర్వాహకులు అడ్డుకున్నారు. సుమారు గంట సమయం పాటు ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. స్వచ్ఛంధంగా ఆక్రమణలు తొలగించాలని, లేకుంటే మరోమారు వచ్చి తామే జేసీబీతో తొలగిస్తామని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరించారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ పావని, సిబ్బంది, స్థానిక, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

పెన్షన్ల గురించి పట్టించుకోని ప్రభుత్వం

అడ్డగుట్ట: పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి ఊసే మరిచిందని విహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు అన్నారు. అడ్డగుట్ట ఏ సెక్షన్లోని ముత్యాలమ్మ ఆలయం వద్ద బుధవారం వికలాంగులు, వృద్ధులు, వితంతువుల సమావేశం విహెచ్‌పీఎస్ సికింద్రాబాద్ కార్యదర్శి పులిపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన అందె రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు వికలాంగుల పెన్షన్ రూ. 6 వేలకు పెంచుతామని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికుల పెన్షన్ రూ. 2వేల నుండి రూ. 4వేలు పెంచుతామన్నారు. అదే విధంగా కండరాలతో బాధపడుతున్న వారికి పదిహేను వేలు పెన్షన్ ఇస్తామని మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచిందన్నారు. బడ్జెట్ లేదని, నిధులు లేవని సాకులు చెబుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పించుకుంటున్నదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తీరును ఎండగాడుతూ ఈనెల 22న అంబర్పేట్ లోని రాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్ లో వృద్ధులు, వితంతువులు, వికలాంగుల మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలతో లబ్ధిపొందండి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: అర్హులైన పేద ప్రజలు తమకు లబ్ధి చేకూర్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సనతనగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో బుధవారం బాలానగర్ తహశీల్దార్ కార్యాలయ పరిధిలోని సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన 12 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కళ్యాణలక్ష్మీ పథకం కింద ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఆడపడుచు పెళ్లికి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా భారంతో కూడుకున్నదని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి పాల్గొన్నారు.

ప్రేమిస్తున్నానని వెంటపడి..ఆపై గర్భవతిని చేసి..

సనత్‌నగర్: ప్రేమిస్తున్నానంటూ వెంటపడి ఓ మైనర్ బాలికను మోసం చేసి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు..అమీర్‌పేట ప్రాంతానికి చెందిన బాలిక (16) అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఓ డయాగ్నస్టిక్ సెంటర్‌కు తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేసిన సిబ్బంది బాలిక ఆరు నెలల గర్భవతి అని తేల్చారు. కుటుంబ సభ్యులు బాలికను ప్రశ్నించడంతో తమ గ్రామంలోని ఓ యువకుడు బలవంతంగా లైంగిక దాడికి చేసి తనను మోసం చేశాడని జరిగిన విషయాన్ని వెల్లడించింది. గత అక్టోబర్‌లో వరంగల్‌లోని స్వస్థలానికి వెళ్లిన సమయంలో ప్రశాంత్(20) అనే యువకుడు ప్రేమిస్తున్నానంటూ బాలిక వెంటపడ్డాడు. ఈ సంవత్సరం జనవరిలో మరోసారి గ్రామానికి వెళ్లినప్పుడు ఇంట్లో బాలిక ఒంటరిగా ఉన్న సమయం చూసుకుని బలవంతంగా లైంగిక దాడి చేశాడు. ఆ తర్వాత కూడా పలుమార్లు బాలికను బలవంతం చేశాడు. బాలిక పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చేసరికి నాలుగు నెలలుగా ఫోన్ లిఫ్ట్ చేయకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు బేగంపేట భూలక్ష్మీ అమ్మవారి ఘటం ఊరేగింపు..

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని భూలక్ష్మీ అమ్మవారి ఘటం ఊరేగింపు కార్యక్రమం ఈ నెల 18న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త విశాల్ సూదం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని భూలలక్ష్మీ లీలా నిలయం వద్ద నుంచి ఊరేగింపు ప్రారంభమై మాధవీ సంతోష్ నివాసం వరకు కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

అనారోగ్యంతో ప్రొ.ప్రభంజన్ యాదవ్ మృతి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ వర్సిటీ జర్నలిజం విభాగం అధ్యాపకులు ప్రొ.ప్రభంజన్ యాదవ్ బుధవారం మృతి చెందారు. గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ నారపల్లిలో మరణించారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభంజన్ మృతికి ఓయూలో పలువురు అధ్యాపకులు, విద్యార్థి నాయకులు సంతాపం తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు..

సనత్‌నగర్: టమాటా.27, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండ 35, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 75, గోకరకాయ 50, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 25, మొరంగడ్డ 28, కందగడ్డ 35, సొరకాయ 13, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్



లాల్ బజార్ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్

బొల్లారం: ఆషాఢ మాస బోనాల జాతర సందర్భంగా తిరుమలగిరి లాల్ బజార్ మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాల వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. భక్తులు పెద్దఎత్తున హాజరై బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఒడిశా విద్యార్థి ఆత్మహత్యకు బాధ్యులను శిక్షించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఒడిశాలోని ఎఫ్ఎం కాలేజీ విద్యార్థి సౌమ్యశ్రీ బిషీ ఆత్మహత్యకు కారణమైన వారిని అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ నాయకులు ఓయూలో ఆందోళన చేపట్టారు. బుధవారం ఓయూ ఎన్‌సీసీ గేటు వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ సౌమ్యశ్రీ బిషీని లైంగిక వేధింపులకు గురిచేసిన కాలేజీ అధ్యాపకుడు, విభాగం హెడ్ పై అత్యాచార, హత్య కేసును నమోదు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు ధృహన్, శివశంకర్, నగర కార్యదర్శి పృథ్వీతేజ, రాష్ట్ర నాయకులు అలివేలి రాజు తదితరులు పాల్గొన్నారు.

తార్నాకలో డే టైం డ్రంకన్ డ్రైవ్

లాలాపేట: మద్యం సేవించి వాహనాలు నడుపరాదని నల్లకుంట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీహెచ్ సుధాకర్‌రావు అన్నారు. బుధవారం పగటి సమయంలో తార్నాకలో ప్రత్యేంగా డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. హబ్సిగూడ నుంచి సికింద్రాబాద్ వైపు వెళుతున్న పలువురి వాహనదారులను ఆపి బ్రీత్ అనలైజర్ టెస్టు చేశారు. ఇందులో ఇద్దరు కారు డైవర్లు, 8 మంది ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదైనాయి.



న్యాయం చేయమంటే అరెస్టు చేస్తారా?

నిరసన వ్యక్తం చేసిన రోడ్డు విస్తరణ బాధితులు



నిరసన వ్యక్తం చేస్తున్న రోడ్డు విస్తరణ బాధితులు

కంటోన్మెంట్: న్యాయం చేయాలని డిమాండ్ చేస్తే అరెస్టులు చేస్తారా? అంటూ రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జేఏసీ సభ్యులు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌ను నెరవేర్చకపోగా, అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జేఏసీ కన్వీనర్ తేలుకుంట సతీష్ గుప్తా ఆధ్వర్యంలో కార్ఖానాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సతీష్ గుప్తా మాట్లాడుతూ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శామీర్‌పేట వెళ్తున్నారనే సమాచారంతో, తూముకుంట వద్ద రోడ్డు విస్తరణ బాధితులు నిరసన వ్యక్తం చేశారని తెలిపారు. ఈ కారణంగా వారిని అరెస్టు చేసిన పేట్ బషీర్‌బాద్ పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా రాజీవ్ రహదారిని 200 ఫీట్లకు విస్తరించడం అన్యాయం అని తాము కొంతకాలంగా ఆందోళన చేస్తున్నామన్నారు. నగరంలో ఎక్కడా లేని విధంగా రోడ్డు విస్తరణ చేపడుతూ ఉండటం వల్ల వందలాది మంది ఆస్తులు, ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని అన్నారు. తమకు పరిహారం విషయంలో ఇప్పటికీ ఎలాంటి అధికారిక ప్రకటన లేదన్నారు. దీనికి తోడు రోడ్డు విస్తరణ ప్రకటన వెలువడిన నాటి నుంచి పలు భవనాలు ఖాళీ అవ్వడంతో అద్దెలు కూడా లేక తీవ్రంగా నష్టపోతున్నామని పేర్కొన్నారు. దీన్ని నిరసిస్తూ ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపితే, అన్యాయం అరెస్టులు చేయడమేంటని ప్రశ్నించారు. తెల్లవారుజామున 4 గంటలకు ఇళ్లలోకి వచ్చి మరీ అరెస్టులు చేయడం వల్ల తమ ఆత్మగౌరవానికి భంగం కలుగుతోందన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదన్నారు. రోడ్డు విస్తరణను 100 ఫీట్‌లకు కుదించి, తమకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్మీకి ఇచ్చిన మాదిరిగానే తాము కోల్పోయే భూములకు సమాన విలువైన భూములను ఇవ్వాలని కోరారు.

100 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు కృషి



అమీర్‌పేట సివిల్ ఆస్పత్రిని సందర్శించిన డీసీహెచ్ఎస్ డాక్టర్ సూర్యశ్రీరావు..

సనత్‌నగర్: అమీర్‌పేట సివిల్ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంచేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు హైదరాబాద్ జిల్లా ఆస్పత్రి సర్వీసులసమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ సూర్యశ్రీరావు తెలిపారు. అమీర్‌పేట ఆస్పత్రిని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలను వాకబు చేశారు. బయటి రోగుల విభాగంలో రోగులతో మాట్లాడారు. ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులు, ప్రసూతి విభాగంలో మహిళలతో మాట్లాడి సమస్యలేమైనా ఉన్నాయా అని ఆరా తీశారు.

సహజీవనం హాస్టళ్లను మూసివేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలో సహజీవనం (కో-లివింగ్) హాస్టల్స్‌ను మూసివేయాలని బుధవారం డీజీపీ జితేందర్‌కు వినతి పత్రం అందచేసినట్లు ఓయూ జేఏసీ నాయకుడు, మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు రాజు నేత తెలిపారు. సహజీవనం హాస్టల్స్‌తో నగరంలో విష సంస్కృతి ప్రబలుతుందన్నారు. తద్వారా మోసాలు, గన్ కల్చర్, డ్రగ్స్, గంజాయి ఇతర మత్తుపదార్థాలకు అలవాటుపడి అశ్లీల కార్యక్రమాలు పెరిగి పోతున్నాయన్నారు.

నేరాల అదుపునకు సహకరించాలి



లాలాపేటలో అవగాహన కల్పిస్తున్న లాలాగూడ పోలీసులు

లాలాపేట: శాంతిభద్రతల విషయంలో పోలీసులకు విధి నిర్వాహణలో ప్రజలు సహకరించాలని లాలాగూడ పోలీసులు పేర్కొన్నారు. లాలాపేటలోని కామన్ వీధిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేరాలను అదుపు చేయడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా నేరాలను అదుపు చేయడంలో సీసీటీవి కెమెరాల ప్రాధాన్యత, ఏదైనా సంఘటన జరిగితే వెంటనే 100 డైల్ ద్వారా సమాచారాన్ని ఇవ్వడం ఎంతో కీలకం అన్నారు. కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్లు అమర్ సింగ్, యుగేందర్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.